# ఆశకు హద్దులు



మాడిరెడ్డి సులోచన

వర్షం వచ్చే సూచనగా గది అంతా ఉక్కగా ఉంది. కమలమ్మ లేచి, కిటికీలు బారుగాతీసింది. బయటకూడా గాలి ఆడటం లేదు. విసుగ్గా ఫ్యాన్ వేసింది. ఫ్యాన్ వేగం పుంజుకుంది. 'అమ్మయ్య' అనుకుంది. ఆమె మనసు. శరీరము చల్లబడ్డాయి. తృప్తిగా బల్ల ముందు కూర్చున్న కూతురు వాణిని చూసుకుంది. 'నిజంగా వాణి వాణే' అనుకుంది. తల్లి ఇంత తతంగముచేసినా ఆమె కళ్ళు పుస్తకంలోనుండి కదలలేదు. ఆ అంకుఠిత దీక్షకు తల్లిమనసు ఆనందపడింది 'గంగి గోవుపాలు గరిటెడయినను చాలు' అన్న సామెత గుర్తుకు వచ్చింది. తనకు ఒక్క కూతురయితేనేం బుద్ధిమంతురాలు. చదువుల సరస్వతి ... ఇంకా ఏదో ఆలోచించ బోయింది. బయట కాలింగ్‌బెల్ వినిపించింది. బెల్ పదే, పదే మ్రోగితే కూతురికి యెక్కడ అవాంతరం కలుగుతుందోనని చక, చక బయటికివచ్చి తలుపు తీసింది. యెదురుగా నిలబడిన బావగారిని, అతని కూతుర్ని చూసి నీరుగారి పోయింది. వెల వెలబోయె ముఖం వారికి కనిపించకూడదని ప్రక్కకు తిప్పుకుని, "రండి" అన్నది.

"భాస్కర్ లేడా అమ్మాయ్" ఆమె బావ గారు నారాయణ అడిగాడు.

"ఉష్" నోటికి చెయ్యి అడ్డంపెట్టుకుని డైవింగ్‌హాల్లోకి దారితీసింది. బిత్తర పోయినట్టుచూచి తండ్రీ, కూతురు ఆమెను అనుసరించారు. మధ్యతలుపు దగ్గరగా వేసింది తొందరగా.

"వాణికి పరీక్షలు" అన్నది ఇటుతిరిగి.

"అంతేకదా! నే నేమేమో ఊహించుకున్నాను" ఆయన తేలికగా నిట్టూర్చాడు. కూర్చీలాక్కుని కూర్చున్నాడు. అతని కూతురు గంగ చేతిలో సూట్‌కేసుతో నిల్చుంది.

"అలా పెట్టి కూర్చోమ్మా" నారాయణ అన్నాడు.

"ఆఁ కూర్చో గంగా! బాగా యెదిగావు, గౌన్లు వేసుకుంటుండగా చూచానయ్యే. సూట్‌కేసు, పక్కచుట్టతో బయలుదేరారు, యాత్రలకు వెడుతున్నారా?" అన్నది.

నారాయణ తటపటాయించాడు చివరకు చెప్పాడు.

"పెద్దాడు ఈఊర్లో ఉండి, వద్దురా అంటే గంగను బి:ఏ. లో చేర్పించాడు. వాడికి ట్రాన్స్‌ఫర్ అయిందని, అమ్మాయిని మా దగ్గర జనగామలో వదలి వెళ్లాడు. అ పరీక్ష కాస్త ఇస్తే బి.ఏ. అవుతుందని..."

"అవునుమరి! హాస్టల్లో వుంచాలని తెచ్చారా! వాణికి పరీక్షలు. లేకపోతే మా ఇంట్లోనే ఉంచుకునేదాన్ని, దానికి ఫస్ట్‌క్లాస్ వస్తుందని అనుకుంటున్నాము. యెలాంటి డిస్టర్బెన్స్ వద్దనుకుంటున్నాము." అన్నది గడుసుగా. గంగ మొహం ఎఱ్ఱగా కంది పోవటం గమనిస్తున్నాడు, అసహాయత కొన్ని సార్లు అభిమానాన్ని ఇస్తుంది.

"అమ్మాయ్ కమలా! నీకు తెలియందేముంది, నాకొచ్చే పింఛను డబ్బుతో ముగ్గురి భోజనముపోగా హాస్టల్లో ఉంచడానికి డబ్బు మిగులుతుందా! నాల్గురోజులు మీ బయటి వరండాల్లో ఉండి చదువుకొని పరీక్ష రాస్తుందన్న ఆశతో వచ్చాను"

"ఇంట్లో అయినా ఉండవచ్చు. మీరేం పరాయివారా? మాకిబ్బంది చెప్పానుగా. ఆడపిల్లయినా. మొగపిల్లవాడయినా వాణే. దాని చదువు ముఖ్యం మాకు..." అన్నది. అతను యెంత ప్రాధేయపడినా లాభం లేకపోయింది.

"చవకలో మీకు తెలిసిన వసతి గృహము లాంటిది ఉంటే..." చివరి ప్రయత్నంగా అడిగాడు నారాయణ.

"నాకు అలాంటి విషయాలేం తెలియవు. వచ్చేసారి మళ్ళీ ఫీజు కట్టండి. అప్పుడు ఇక్కడే ఉంచుకొంటాను"

"అంతేనంటావా!" నారాయణ ముఖం నిరాశతో, చిన్నబోయింది.

"వాణికోసం అందరం పెందలకడే తినేస్తాం. మీకు వంటచేస్తాను" కమలమ్మ వంటింటివైపు కదిలింది.

"పిన్నీ! భోజనంచేసే బయలుదేరాం, నాన్నగారయితే రాత్రిళ్ళు సరిగ్గా భోజనము చెయ్యరు ... ఇప్పుడేం వద్దు" అప్పటివరకు మౌనంగావున్న గంగ కలుగజేసుకుంది.

"పోనీ మజ్జిగ త్రాగండి..." ఆమె లోపలికి పోబోయింది. వెనుక వరండా గుమ్మం తీసుకొని భాస్కరరావు వచ్చాడు. చూడగానే ఒకేమూసలో తీసినబొమ్మలు గుర్తుకువస్తాయి. జాగ్రత్తగా మడచి షోకేసులో పెట్టిన బొమ్మలా ఉంటాడు భాస్కరరావు. దుమ్ము. ధూళితో కొట్టుకుపోతూ రంగు వెలసిన బొమ్మలా ఉంటాడు నారాయణ.

"అరే ... అన్నయ్యా! ఎప్పుడొచ్చావ్! ఓ .. గంగ ... యెంత యెదిగిపోయావే" సంతోషంగా అరిచాడు

"ఉష్! ఏమిటా గావుకేకలు. వాణి చదువుకుంటోంది"

"ఓ సారీ మేడమ్!..." తనూ ఓ కుర్చీ లాక్కుని కూర్చుని, అన్న క్షేమ సమాచారాలు అడిగాడు. కమలమ్మ తెలివిగా వారు వచ్చిన పని. తన నిస్సహాయత చెప్పింది. భాస్కర్ ముఖం చిట్లించాడు.

"అదేమిటి కమలా! ఒక సంవత్సరం వేస్ట్‌కాదూ!"

"మరేం చేస్తాం..." అన్నది కళ్ళతో అతనికి ఏదో చెప్పాలని తాపత్రయ పడింది.

"రేపు ఉదయం ఏదో ఏర్పాటు చేస్తాను. నువ్వు పడుకో అన్నయ్యా ... గెస్ట్‌రూమ్‌లో నీళ్ళుపెట్టు కమలా..."

"గెస్ట్‌రూమ్ ఎం[illegible]కురా! హాయిగా పెరట్లో పడుకుంటాను, [illegible]గా గాలి వస్తుంది అన్నాడు. భార్యా, [illegible]లు లోపలికి వెళ్ళిపోయారు. గంగ పెరటి వరండాలో తనకు, తండ్రికి పక్కపరిచింది

"నిజంగా ఆకలిగా లేదా గంగా?"

"నాన్నా! మీరు పాఠాలు ఎంత స్పష్టంగా చెప్పగలరో బంధుత్వాలను అంత అస్పష్టంగా అర్థం చేసుకున్నారు, నాకు పరీక్ష రాయాలని లేదు" అన్నది తమ సామాన్లు ఓ ప్రక్కన సర్దుతూ.

"చూడమ్మా అంత తొందర కూడదు." మందలింపుగా అన్నాడు. అతని కళ్ళముందు ఎన్నో దృశ్యాలు కదిలాయి. ఇంటికి పెద్ద కొడుకుగా తనకంటూ ఏం మిగుల్చుకోక తమ్ముల చదువులు. చెల్లెళ్ల పెండ్లిళ్ళు చేశాడు. అందరూ రెక్కలొచ్చిన పక్షులే అయ్యారు. నారాయణ ఉనికినే అసహ్యాహించుకొనేవారు. ఒక్క భాస్కర్ మాత్రము అన్న అంటే అభిమానము చూపిస్తాడు. బడిపంతులు చేసి రిటైర్డు అయిన నారాయణ ఇద్దరి కొడుకులను గుమస్తాలుగా చెయ్యగలిగాడు. ఆఖరుగా ఆలస్యంగా పుట్టిన గంగ వివాహము సమస్యగానే ఉంది. బి, ఏ, చదివించి ఎక్కడ

యినా ఉద్యోగం వేయిస్తే ఉద్యోగం చేస్తున్న అమ్మాయి అని కట్నం లేకుండా చేసుకుంటారని అతని ఆశ. కమలమ్మ నైజం యెరిగినా అభిమానం చంపుకుని వచ్చాడు. కూతురికి చిల్లర బుద్ధులు అబ్బుతాయని, అత్తవారి వైపు బంధువులను అవి జాగ్రత్తగా దూరంఉంచింది. వాణిని జాగ్రత్తగా తన తెలివినంతా ఉపయోగించి పెంచింది. పరీక్షలంటే ఆ యింట్లో వానికి ఎంత అపురూపంగా జరుగాలో అంత అపురూపంగా జరుగుతు ఉంది. కూతురు చదువుతుంటే తల్లి జడ వేస్తుంది. తండ్రి జవాబులు తయారుచేసి ఇస్తాడు. ఏ ప్రశ్నకు ఏ విధంగా సమాధానం వ్రాయాలో అర్థం చేస్తాడు. కొన్నిసార్లు తల్లేచదువుతుంది గట్టిగా. వాణి బి. ఎస్సీ వరకు వచ్చింది. డాక్టర్‌ను చేద్దామన్న కోర్కె తీరలేదు. వాణికి జంతువులంటేనే భయము. రిసర్చి కాగా అందరూ గర్వించే విధంగా ఉండాలని వాణికోరిక. కూతురి చదువుకు యెలాంటి ఆటంకము భరించలేదా తల్లి, భర్తకు జ్వరం వస్తేనే, మూల్గుతూ కూతురి అటెన్‌షన్ డైవర్ట్‌చేస్తాడని నర్సింగ్‌హోమ్‌లో చేర్పించింది, ఇంటర్ చదువుతుండగా ఇప్పుడు గంగను ఉంచుకుంటుందా: ఉంచుకుంటుందనుకోవటం తన పొరపాటు అని గ్రహించాడు నారాయణ.


మర్నాడు భాస్కర్ గంగను ఉండనియ్యమని చెప్పినప్పుడు తెల్లమొహము వేశాడు. నారాయణ గంగకు నచ్చజెప్పి ఉంచివెళ్ళాడు. అతను వెళ్ళిపోగానే కమలమ్మ గంగ దగ్గరకు వచ్చింది.

"గంగా ఆ పెరట్లో చెట్టుక్రింద దిమ్మెపై కూర్చుని చదువుకో. నోరు తగ్గించి మాట్లాడాలి."

"అలాగే పిన్నీ." అన్నది తన పెట్టిబెడ్డింగు పెరటి వరండాలో పెట్టి పుస్తకాలు తెచ్చుకుని చెట్టుక్రింద కూర్చుంది. వంటింట్లో నుంచి కాఫీ వాసన వేస్తుంది. వంట భోజనాలు అయినట్టున్నాయి. ఛీ చదవక ఈపిచ్చి ఆలోచన ఏమిటి? తనను తాను మందలించుకుంది.

"కమలా! గంగ భోజనము చేసిందా?" భాస్కర్ గొంతు అది. "మీకేం తెలియదు. నన్ను పిలిచి, డిస్టర్బ్ చెయ్యకు పిన్నీ నాకు ఆకలిగా ఉన్నప్పుడు తింటాను అన్నది.పరీక్ష చదువు"

"అలాగా... నాకు తెలియదు" అతనువెళ్ళిపోయాడు. తన పిన్ని జాణతనానికి ఆశ్చర్యపోయింది. అరగంట తరువాత పప్పూ, అన్నం వడ్డించిన పళ్ళెం వరండాలో పెట్టింది గంగ మాట్లాడక అది తీసుకుని తిన్నది. ఇక్కడో గమ్మత్తయిన మనస్తత్వముంటుంది. ధనికులంతా బీదవారిని, మధ్యతరగతి వారిని చాలా తక్కువగా అంచనా వేసుకుంటారు. నిజానికి శుభ్రమైన తిండి, రుచికరంగా తినేది మీరే. ధనికుల భోజనము వంటవాడి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. వాడి మూడ్‌ను బట్టి టేస్ట్ మారుతుంది. అలాగే కమలమ్మ కూడా గంగ విషయంలో పొరపాటు పడింది. గంగ అలాంటివి పట్టించుకోవడం మాని వేసింది. "గంగా! ఊర్కే చదివితే బుర్రకు ఎక్కదు కాస్త ఈ జాడించిన బట్టలు ఆరవేయమ్మా ఆ చేత్తోనే ఆచెట్టుక్రింద



చెత్త ఊడ్చెయ్యి." అనేది ఆ తరువాత రొట్టెలు వత్తమని, కూరలు తరిగి వంటామెకిమ్మని పనులు పురమాయించేది. భాస్కర్ కలుగజేసుకుంటే అతి తేర్పుగా సమాధానం చెప్పేది

"గంగా ఆ చెట్టుక్రింద, యెందుకమ్మా యిలా వచ్చి కూర్చో." భాస్కర్ పిలిచాడు

"మీరు భలేవారండీ! ఆ అమ్మాయికక్కడే గాలి ఆడుతుందట" కమలమ్మ కలుగుజేసుకునేది. వాణిమాత్రం భోజనాల దగ్గర కనిపించేది. యెలా చదువు తున్నావు? అని గంగ పలుకరించినా ఆమె విసుక్కునేది. "నాకు పరీక్షలున్నాయి. క్లాసురాని బ్రతుకు దండగ..." అంటూ వెళ్ళి పోయేది.

వరండా లైటుక్రింద రాత్రి చదువుతుంది గంగ. వలభై నంబరు బల్బు. కళ్ళు నొప్పులు పుడుతున్నాయి. ఇంటిముందు లైటు కాంతివంతముగా వెలుగుతుంది. ఇంటిచుట్టూ తిరిగి వచ్చింది. ఆలైటుముందు కూర్చుని చదువుకుంటున్న గంగ యెవరో గోడ దూకగానే కెవ్వుమని అరిచింది. దాంతో అందరు మెలకువ తెచ్చుకున్నారు దొంగ వచ్చాడా. యెందుకు అరిచావ్ అనలేదుగాని, కమలమ్మ వాణిచదువు పాడయిందని గోల.

"వెధవగోల అందుకే యెవర్నీ వద్దన్నాను. నామాట మీరువింటారా ఫస్టుక్లాస్ పోతుంది"

"అబ్బ ఏమిటి కమలా నీగోల. అయిదు నిమిషాలకు కొంప మునిగి పోయినట్టు చేస్తావేం?"

"నేను పరీక్ష మానేస్తానమ్మా..." పుస్తకం నేలకేసి కొట్టింది, గంగ నెమ్మదిగా పుస్తకంతీసి వాణి చేతిలో పెట్టింది.

"ఇక ఇలాంటి అవాంతరం రాదని హామీ ఇస్తున్నాను పిన్నీ. మళ్ళీ ఏదయినా జరిగితే నేను వెళ్ళిపోతాను" అన్నది. గంగ తన మాట నిలబెట్టుకుంది. పరీక్షలు ప్రారంభించారు, పరీక్ష అయిన సాయంత్రము వాణి చుట్టూ తల్లి, తండ్రి చేరి ఏ ప్రశ్నకు యెలా రాశావని అడగటం, స్నేహితులకు టెలిఫోన్లు చేయటం చూస్తుంటే, జీవితంలో ఏదో క్రొత్త విషయం చూస్తున్నట్టు ఉంది గంగకు. అంత హడావుడి చేయకపోయినా. తండ్రి పేపర్ విషయాలు అడిగి 'బాగా చేశావు' అంటే ఒకరకమైన తృప్తి కల్గేది. కమ్మగా టీ వాసన వేస్తుంది, పిన్ని పిలిచిఇస్తే బావుండును అనుకుంది. కమలమ్మకు అంత ఉదారత లేదు, ఉన్నా ఉత్సాహంలో మరచిపోయింది.

రెండోపరీక్షఅయింది. గంగ వేళ్ళు మడిచి ఇంకా యెన్నిరోజులుండాలో లెక్కవేసుకుంది.

"గంగా! రేపటిపేపర్ చాలా కష్టంపాట్టెంటా? కమలమ్మ ఆప్యాయంగా అడిగింది. సినిమాకు రమ్మంటుందేమో, బోరు కొడుతుందనుకొని, లేదని చెప్పింది.

"వాణి కళ్ళు మండుతున్నాయట, కాస్త చదువుతావా" తను చదువుకోవాలి, ఆమాట పైకి అనలేదు,

"అవునూ, నువ్వు క్లాసు ఎక్స్‌పెక్ట్ చెయ్యటం లేదుకదా? అది క్లాస్ మిస్ అయిందంటే పిచ్చిదవుతుంది" కమలమ్మ ఆశకు ఆశ్చర్యంగా చూసి, అర్ధరాత్రివరకు వాణి అడిగిన పప్నీ చదివి వినిపించింది, వాణి చాలు.అన్న తరువాత వచ్చి తన పాఠము చదువలేక పడుకుంది. ఉదయము లేవగానే మళ్ళీ చదువమని పిలిచింది, "చాల్లే తెలివి. అది చదువుకో వద్దు? నేను చదువుతాను" భాస్కర్ అడ్డు వచ్చాడు. గంగ పుస్తకం తీసింది. ఏ ప్రశ్న చదువాలో తెలియలేదు. అంతకు క్రితంరోజు హాల్లో విద్యార్థులు ఇంపార్టెంట్ అన్నవి, నాల్గుప్రశ్నలు చదివేసరికి సమయము అయింది. గబ గబ స్నానముచేసి, భోజనానికి వెళ్ళింది. వంటకాలేదు. ఇంట్లో వారంతా

వాణిగదిలో వున్నారు. వాణి వాంతి చేసుకుంటుంది.

"నాన్నా...నా పరీక్ష"

"నేను తీసుకు వెడతానమ్మా...నువ్వు ఈ తేనె తీసుకొని పదినిమిషాలు రెస్టు తీసుకో" భాస్కర్ గొంతుఅది.

"ఇదేం ఖర్మండీ! ఈ స్థితిలో పరీక్ష రాయగలదా" ఏడ్పుగొంతుకతో కమలమ్మ అంటుంది. ఆ స్థితిలో తనకు భోజనము పెట్టే వారెవరూ లేరని తెలుసు. కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయింది గంగ. ఆమె అదృష్టం ఏమంటే చదివిన ప్రశ్నలన్నీ వచ్చాయి, ఆ తృప్తితోనే ఆకలి మరచిపోయి ఇల్లు చేరింది. భాస్కర్ ఒక్కడే ఉన్నాడు ఇంట్లో,

"పిన్నీ, వాణి ఏరిబాబాయ్! వాణి పరీక్ష వ్రాసిందా?"

"లేదమ్మా! అప్‌సెట్ అయింది, నర్సింగ్ హోమ్‌లో చేర్పించాం. అసలు ఈ కాలపు పిల్లలకు చదువు, ప్రణాళిక అంటే ఏమిటో తెలియదు" అన్నాడు.

"ఈకాలం పిల్లలకు కాదు బాబాయ్. తల్లి, తండ్రులకు" అన్నది మెల్లగా.

"ఏమిటమ్మా?"

"ఏం లేదు..." వెళ్ళి ముఖంకడుక్కొంది. అతనడిగితే టీ చేసి, తనూ త్రాగింది. యెందుకో ఆ టీ అమృతములా అనిపించింది. అన్నం తిన్నది.

"గంగ పరీక్షలు అయ్యేవరకు వాణి ఆస్పత్రిలోనే ఉంది. కమలమ్మ కూతురి దగ్గరే యెక్కువ ఉంటుంది. గంగకు గిల్టీగానే వుంది. తనువచ్చిన వేళావిశేషం అనిపిన్నమ్మ అంటే ఏం చేస్తుంది! ఆ మాటలు పడే సహనము తనకు లేదు. సాయంత్రము ఊరు వెళ్ళాలి.

"పరీక్షలతోనే సరిపోయింది. నాల్గురోజులుండమ్మా. ఊరు చూద్దువుగాని" భాస్కర్ అడిగాడు.

మళ్ళీవస్తాను బాబాయ్. వాణిని అడిగానని చెప్పు" అన్నది. వెళ్ళేలోపున ఒకసారి చూడాలని ఉన్నా, ఆ కోర్కెను బలవంతంగా అణచుకుంది.

గంగ తన ఇంటికి వచ్చాక అసలు కమలమ్మ ప్రవర్తనే దాదాపు మరచిపోయింది. రిజల్ట్సుకోసం వేచిచూచింది. ఒకరోజు కమలమ్మ ఉత్తరం వచ్చింది. మొదట తనకు పరిచయంలేని దస్తూరి యెవరిదాఅని చూచింది, విప్పి ఆశ్చర్యపోయింది. మొదటి పేరాలో ఆశీర్వచనాలు, తన విషయాలు వ్రాసింది.

"గంగా! ఆనాటినుండి ఉంది. మనము తలచుకొన్నది జరగడం మనచేతుల్లో లేదని, అయినా ఆదొక చాదస్తం క్రింద తీసివేస్తున్నాము. నీపట్ల నాకు కోపం లేదమ్మా, నా కూతురిపట్ల విపరీతమయిన అభిమానముంది. ఆమెభవిష్యత్తుపట్ల అంతులేని ఆశను పెంచుకొన్నాను, ఆశఅధికమైతే దురాశ అవుతుందని విధి మరోసారి పాఠము నేర్పింది. నిన్నింత నిర్లక్ష్యం చేసినా, సెకెండ్ క్లాసులో పాసయ్యావు. నా హృదయపూర్వకమైన అభినందనలు. మీ బాబాయ్ తెలుసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో పేపర్లో రావచ్చు... వాణి బాగా అప్‌సెట్ అయింది. మళ్ళీ పరీక్ష ఇవ్వటానికి అంగీకరించింది." ఇలాగే తనను క్షమించమంటూ వ్రాసింది.

"ఏం జరిగిందే?" తల్లీ, వదిన కుతూహలంగా ప్రశ్నించారు.

"ఏం లేదమ్మా..." అని, పిన్నమ్మ ప్రవర్తన చెప్పింది, వాళ్ళు ఆ క్షణములో అన్నీ మరిచిపోయారు. ఒక్కటే గుర్తుంచుకున్నాం.. ఏది ఏమయినా గంగ పాసయింది అంతేచాలు. వారి ఆశకో హద్దుంది, ఆశయానికోగమ్యం ఉంది. గంగమాత్రం పిన్నినిగూర్చి ఆలోచిస్తూ గంభీరంగా ఉండిపోయింది.

*With best Compliments from :*

**ASIATIC TRADERS (REGD.)**

Governorpet :: VIJAYAWADA-520002

Branch : Himayatnagar – HYDERABAD-500029.

***DISTRIBUTORS FOR :***

M/s. Abbott Laboratories (India) Private Ltd., Bombay,
M/s. Dolphin Laboratories Private Ltd., Calcutta,
M/s. MIT Laboratories (A Divn. of IDL Chemicals Ltd.,) IDL Buildings, Malleswaram, Bangalore.
M/s. Biddle Sawyer & Co., (India) Private Ltd., Bombay.
M/s. Indian Schering Ltd., Bombay.

**S. RAMAKRISHNA**, B.Com.,
Managing Partner.